క్లుప్తంగా

అక్షరనేత్రం పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

నంద్యాల(వ్యవసాయం): కవి కొప్పుల ప్రసాద్ రచించిన అక్షరనేత్రం అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా గురువారం స్థానిక బాలాజీ విద్యామందిరం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆవిష్కరించారు. కౌన్సిలర్ అబ్దుల్‌మజీద్, కరస్పాండెంట్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠోత్సవాలు



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: ఆలమూరులోని లక్ష్మీదేవి,చెన్నకేశవ, లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద చేపట్టిన ధ్వజ, విగ్రహ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఆలయ ఈఓ సాయి జయ చంద్రారెడ్డి, కమిటీ చైర్మన్ శూలం ప్రభాకర్, గ్రామ సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు కలిసి కార్యక్రమం చేపట్టారు. చివరి రోజు విగ్రహ యంత్రాభిషేకం, యంత్ర, ధ్వజ ప్రతిష్ఠ గావించారు. వేడుకల్లో జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగులు ప్రభాకర్‌రెడ్డి పాల్గొనగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

శివాలయాల ముస్తాబు



ముస్తాబైన బైటిపేట ఆంజేయస్వామి ఆలయంలో నాగనంది

నంద్యాల(వ్యవసాయం): మహాశివరాత్రి పర్వదినాన్ని కనుల పండుగగా నిర్వహించడానికి పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం రాత్రి లింగోద్భవం తర్వాత శివ పార్వతుల కల్యాణాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్నందున ఆ మేరకు ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు, ఆలయ ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, ఆంజనేయశర్మ తెలిపారు. ఆయా ఆలయాల్లో అభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం, కల్యాణం, బిల్వార్చన, అష్టోత్తర కలశ క్షీరాభిషేకం తదితర పూజలుంటాయని పేర్కొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

నంద్యాల టౌన్: పట్టణంలోని నెరవాటి పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల ఐఎంఏ మిషన్ పింక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ నెరవాటి అరుణకుమారి, డాక్టర్ అనూష, డాక్టర్ అనిత, డాక్టర్ రజిని ,డాక్టర్ తేజస్విని, కీర్తన పాల్గొన్నారు.

దోషులను శిక్షించాలి

నంద్యాల(వ్యవసాయం): రావులపాలెం మండలం మధురవాడ గ్రామానికి చెందిన సాయిపవన్ కల్యాణ్ ఫొటోగ్రాఫర్‌ను ప్రోగ్రాం పేరుతో తీసుకొని వెళ్లి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ది నంద్యాల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేషిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు.

కుట్టు మిషన్ల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బ్యాంక్ కార్యాలయంలో రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మేనేజర్లు జీవన్‌కుమార్, ఫరీదా, మహీంద్ర పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

గోస్పాడు: వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం గురువారం ముగిసింది. కానాలపల్లె గ్రామంలో గత వారం రోజులుగా ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సంతోష్‌కుమార్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్లు వెంకటేశ్వర్లు, సరళమ్మ విజయభాస్కర్, శ్రీనివాసరెడ్డి, గీతా శిరీష, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలు

ఆళ్లగడ్డ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అహోబిలం, బాచేపల్లి గ్రామాల్లో గురువారం ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత నాయక్, ఎస్ఐ నరసింహులు, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ వరీంధర్ ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు.

రంజాన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నంద్యాల(వ్యవసాయం): ఇమామ్‌ల సంఘం ఆధ్వర్యంలో నూనెపల్లెలోని ఖుబ్రా మసీదులో గురువారం రంజాన్ నెల క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు అంజాద్‌బాషా సిద్ధిఖీ మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుంచి ఉపవాసాలు ప్రారంభమవుతాయని, క్యాలెండర్ ప్రకారం సహేరి, ఇఫ్తార్ పాటించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాలన్యూటౌన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివశంకర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై డీఈఓతో చర్చించామని చెప్పారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం



ఎర్రగుడిదిన్నెలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న దృశ్యం,



ఆర్‌బీకే తాళాలను వీఏఏకు అప్పగిస్తున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో పలు అభివృద్ధి పనులకు పుట్టాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి,ఆళ్లగడ్డ వ్యవసాయమార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి తో కలిసి ప్రారంభించారు. మొత్తం 22 గ్రామాల్లో 26 అభివృద్ధి పనులు ప్రారంభించారు. పేరూరులో సీసీ రోడ్లు, ఎర్రగుడిదిన్నెలో ఆర్‌బీకే నూతన భవనం, సీసీ రోడ్లు, చిలుకలూరులో పైప్‌లైన్, రక్షిత మంచినీటి పథకానికి ప్రారంభోత్సవం చేశారు. చందలూరు,నక్కలదిన్నె,మందలూరు గ్రామాల్లో సీసీరోడ్లు, ముత్తలూరులో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, సీసీరోడ్లు, నర్సాపురం,ఆలమూరు, చిత్రేనిపల్లె, ముకుందాపురం గ్రామాల్లో సీసీరోడ్లు, తిప్పారెడ్డిపల్లె వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు భూమిపూజ, అలాగే సీసీరోడ్లు, టీ.లింగదిన్నెల్లో తారురోడ్లు, సీసీరోడ్లు, ఆర్.నాగులవరంలో గ్రామ సచివాలయం , సీసీరోడ్లు, రెడ్డిపల్లెలో సీసీరోడ్లు, రుద్రవరంలో గ్రామ సచివాలయం-2, గ్రామ స చివాలయం-3, సీసీరోడ్లు, ఆర్.కొత్తపల్లెలో తారురోడ్లు, చిన్నకంబలూరులో సీసీ రోడ్లు, డీ.కొట్టాలలో తారు రోడ్లు, సీసీ రోడ్లు, శ్రీరంగాపురంలో సీసీరోడ్లు, ఎల్లావత్తుల, బీరవోలు, కే.కొత్తూరు గ్రామాల్లో సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం గావించారు. ఆయా గ్రామాల్లో వారిని స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని మాచినేనిపల్లెలో విజయ డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి, డైరెక్టర్ విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లింగ నిర్ధారణ వీర్యముతో కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా జన్మించిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ వారు లేగ దూడలకు రోగ నివారణ కోసం డీవార్మింగ్ చేశారు. అనంతరం ఆ దూడల రైతులకు మందులు,ఇతర సామగ్రి పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాధవి,ఎంపీడీఓ రామచంద్ర,ఏడీ గిడ్డయ్య,ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్,ఏఓ కృష్ణ,సింగిల్ విండో డైరెక్టర్ గోపిరెడ్డి పుల్లారెడ్డి,సుదర్శన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సేవాదల్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శుద్దుల కృష్ణుడు, పార్టీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, సర్పంచులు,ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పీవీ నగర్‌కు కొత్త శోభ



పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి



సమావేశానికి హాజరైన ప్రజలు

నంద్యాల(సిటీ): పీవీ నగర్‌కు నూతన వైభవం తెస్తామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక 1వ వార్డులో 276 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 30 సంవత్సరాల క్రితం పీవీ నరసింహారావు పలువురు పేదలకు నిర్మించిన గృహాలు శిథిలమైన వాటి స్థానంలో కొత్త ఇళ్లను ఆర్డీటీ సహకారంతో నిర్మిస్తామన్నారు. పేద ప్రజలను 30 సంవత్సరాలుగా ఏ ఒక్క రాజకీయ నాయకుడు పట్టించుకోలేదని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాత యజమానుల పేర్ల మీద పట్టాలను పంపిణీ చేయడం గర్వంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ రూ.12.5లక్షల విలువైన రెండున్నర సెంట్ల స్థలాన్ని ఇచ్చి వారిని యజమానులుగా చేస్తున్నామని చెప్పారు. రోడ్డును ఆనుకుని ఉన్న విలువైన భూమి పట్టాల పంపిణీలో ఎలాంటి రాజకీయం లేకుండా పారదర్శకంగా కేవలం అర్హత ఆధారంగా పట్టాలు ఇస్తున్నామన్నారు. మంచి చేస్తున్న వైఎస్సార్‌సీపీని మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ పాంషావలి, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, మునయ్య, కన్నమ్మ, ఎర్రన్న, తిమ్మరాజు, ఓబులేసు, బాబు, జయకుమార్, మధుబాబు, సాయిబాబ, బోడెన్న, అర్జున్, శేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేలంలో తగ్గిన ఆదాయం

డోర్నిపాడు: స్థానిక గ్రామ సచివాలయంలో సంతమార్కెట్ వేలం పాటను గురువారం ఈఓపీఆర్డీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో ఐదుగురు పాల్గొనగా అశోక్‌కుమార్ రూ.6.25 లక్షలకు దక్కించుకున్నాడు. గతేడాది రూ.6.66 లక్షలకు వేలం పాట జరిగిందన్నారు. దీంతో ఈసారి రూ.41వేల పంచాయతీకి ఆదాయం తగ్గిందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవమణి, పంచాయతీ కార్యదర్శులు నాగర్జున, మాలతి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ: పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఇంటి స్థల బదలాయింపు దస్తావేజుల పంపిణీ కార్యక్రమం తహసీల్దార్ నజీర్ అహ్మద్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన గంగుల ప్రభాకర్‌రెడ్డి నియోజవర్గంలోని ఆరు మండాలలకు చెందిన 4,862 లబ్ధిదారులకు రిజిస్ట్రేన్ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ అందరికీ మంచి చేస్తున్న జగనన్నను సీఎం కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆరు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులకు సర్పంచ్ రామమద్దిలేటిరెడ్డి ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు పొందిన 359 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. వీఆర్ఓ దాదా సాహెబ్ పాల్గొన్నారు.

పట్టాల రిజిస్ట్రేషన్ చరిత్రాత్మకం

శిరివెళ్ల: లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం చరిత్రాత్మకమని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. గురువారం 2వ గ్రామ సచివాలయంలో 90 మంది లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందచేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 2,345 మంది మహిళలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిందన్నారు. శిరివెళ్లలో 335 మందికి, గోవిందపల్లె 222, యర్రగుంట్ల 108, గంగవరం 80, గుంప్రమాన్‌దిన్నె 102, జీనేపల్లె 95, కోటపాడు 27,బోయలకుంట్ల 32,మహదేవపురం 14, చెన్నూరులో 27 మంది పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఉప సర్పంచ్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



గండ్లేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఈఈ శంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: ఈ ఏడాది నెలకొన్న వర్షాబావ పరిస్థితులు, రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఇప్పటికే తాగునీరు అందిస్తున్న అనే బోర్లు నిలిచిపోయాయి. దీంతో ఈ సారి వేసవి కాలం ముగిసేసరికి పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తుతుందని ప్రజలు, అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. గమనించిన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి నీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వంతో మాట్లాడి వెలుగోడు రిజర్వాయర్ నుంచి గండ్లేరు రిజర్వాయర్‌కు 0.2 టీఎంసీల నీటిని విడుదల చేయించారు. గురువారం నుంచి తెలుగుగంగ ప్రదాన కాలువ ద్వార రిజర్వాయర్‌కు నీరు చేరుకుంటోంది. శుక్రవారం రాత్రికి పూర్తి స్థాయిలో నీరు చేరుకుంటుందని తెలుగుగంగ ఈఈ శివశంకర్‌రెడ్డి తెలిపారు.

పోలీస్ పికెటింగ్..

రిజర్వాయర్‌లో ఉన్న నీటిని రైతులు వాడుకోకుండా తూముల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ నీటితో మూడు నెలల పాటు తాగునీటికి ఇబ్బందులు తలెత్తవని , ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అభినవ శంకరానందస్వామి



మాట్లాడుతున్న న్యాయమూర్తి శైలజ



దేశం సులోచనను సత్కరిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

చాగలమర్రి: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అద్భుతమని అభినవ శంకరానందస్వామి అన్నారు. గురువారం స్థానిక న్యూబిల్డింగ్స్ కాలనీలోని జననీ పరస్పర సహాయక సహకార సంఘం కార్యదర్శి జ్యోతి మార్తమ్మ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మహిళా శక్తి గురించి మాట్లాడుతూ తమ పిల్లలను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్ద గలిగే ఘనత మాతృమూర్తికే ఉందన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం ఎంఎస్ఎంఈ ద్వారా టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. సంఘం సీఈఓ ఆకుల వెంకటరమణ, ఏఓ అప్పపోగుల వెంకటసుబ్బయ్య, రిటైర్డ్ అధ్యాపకులు రమణయ్య పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.అనంతరం అధ్యాపకులు ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. అధ్యాపకులు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శిరోమణి పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభివృద్ధి

ఆళ్లగడ్డ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి శైలజ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆళ్లగడ్డ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి శైలజ మాట్లాడుతూ మహిళలు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాజంలో మహిళ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. కమిషనర్ రమేష్‌బాబు, సీడీపీఓ తేజేశ్వరి, పట్టణ ఎస్ఐ నగీనా, ఏపీపీ సోమశేఖర్‌రెడ్డి, న్యాయవాది సరిత ఉన్నారు.

హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): మహిళా హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మావతి అన్నారు. గురువారం నంద్యాలలోని స్థానిక కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన చేతివృత్తి దారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పద్మావతి, నంద్యాల సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడారు. అనంతరం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షురాలుగా నారాయణమ్మ, నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షమీమ్‌బేగం, జిల్లా ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, స్వాతి, తిరుపాలమ్మ, సుశీలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజిత, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీదేవి, ముర్తుజాబీ, హసీనా, దేవమణి, కోశాధికారిగా ప్రమీలమ్మలతో పాటు 32మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నంద్యాల(వ్యవసాయం): మహిళలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను ఉపయోగించుకోవాలని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్ దేశం సులోచన అన్నారు. గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక శ్రీశైలం పబ్లిక్ స్కూల్‌లో నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. న్యాయవాది శ్రీదేవి, లక్ష్మికల్యాణి, పుల్లిబాయి, రత్నలక్ష్మి, భారతమ్మ, శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఓబులపతి పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

ఉయ్యాలవాడ : మండలంలోని రెండు గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం ఆరోగ్య శ్రీ కార్డులను మంజూరు చేసినట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 9 గ్రామ సచివాలయాలకు 4,142 ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరు కాగా రెండవ విడత అల్లూరు కు 467, తుడుమలదిన్నెకు 352 ఆరోగ్య శ్రీ కార్డులు మంజూరయ్యాయని, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు పంపిణీ చేస్తారని చెప్పారు.

గుడిసె దగ్ధం

రుద్రవరం: మండలంలోని రెడ్డిపల్లెలో గురువారం మాధవికి చెందిన పూరి గుడిసె అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చుట్టూ వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఇటీవల పొలాల్లో పంట కోతలు పూర్తి కావడంతో రైతులు పొలాల్లోని వ్యర్థాలను కాల్చే క్రమంలో నిప్పు రవ్వలు గాలికి వచ్చి పూరి గుడిసె మీద పడటంతో ప్రమాదం సంభవించింది. దీంతో గుడిసెలో సామగ్రి, కాలిపోయాయి. దాదాపు రూ.లక్ష వరకు నష్టపోయానని బాధితురాలు విలపించింది.

సమస్యలపై అధికారులు స్పందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: ఎన్నికల నియమావళి దృష్ట్యా ప్రజాప్రతినిధుల జోక్యం లేకపోయినా మండలంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. గురువారం స్థానిక మండలపరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ సుర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి మొదలైందని నీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్‌లు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్యతో కలిసి సౌకర్యాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని శిరివెళ్ల, చాగలమర్రి పరిసర ప్రాంతాల్లోని భూములు ఆయిల్‌పాం పంటలకు అనుకులంగా ఉన్నాయని, సాగుకు కొందరు రైతులు ముందుకొస్తున్నారన్నారు. ఉపాధి ఏపీఓ నిర్మల మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో ఫాంపాండ్స్ ఏర్పాటు చేసుకుంటే నీటి ఎద్దడి కారణంగా పంటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చన్నారు. ఫాంపాండు ఏర్పాటు రూ.1.50 లక్షలు ఖర్చవుతుందని ఇందులో ప్రభుత్వం రూ.75 వేలు సబ్సిడీ మంజూరు చేస్తుందన్నారు. వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఎంపీటీసిలు లక్ష్మీరెడ్డి, ఎద్దుల రాజేశ్వరి, వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు బంగారు షరీఫ్, ప్రతాప్‌రెడ్డి, గోవిందయ్య, మహేశ్వరి పాల్గొన్నారు.

నాడు-నేడు నిధుల మంజూరు

శిరివెళ్ల: మన బడి నాడు- నేడు 2వ దశ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని ఎంఈఓ శంకరప్రసాదు గురువారం తెలిపారు. రెండవ విడత ఎంపికైన పాఠశాలల్లోలో 95 శాతం పనులు పూర్తయ్యాయరన్నారు. మిగిలిన పనులను పూర్తి చేయుటకు నిధులు విడుదల చేసినట్లు చెప్పారు. యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.14.73 లక్షలు, వీరారెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10.39 లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ.1.75 లక్షలు, కాదరబాదర పాఠశాలకు రూ.1.26 లక్షలు, ఇసుకపల్లె ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.5.25 లక్షలు, శిరివెళ్ల మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ.2.04 లక్షలు, రాజనగరం ఉన్నత పాఠశాలకు రూ.2.96 లక్షలు, మహదేవపురం స్పెషల్ ప్రాథమిక పాఠశాలకు రూ.1.55 లక్షలు, గోవిందపల్లె స్పెషల్ ప్రాథమిక పాఠశాలకు రూ.3.23 లక్షలు మంజూరయ్యాయి. బోయలకుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.3.58 లక్షలు, యర్రగుంట్ల స్పెషల్ ప్రాథమిక పాఠశాలకు రూ.1.88 లక్షలు, చెన్నూరు ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.5.70 లక్షలు, శిరివెళ్ల డిపెప్ ప్రాథమిక పాఠశాలకు రూ.2.30 లక్షలు, మహదేవపురం ఉన్నత పాఠశాలకు రూ.14.75 లక్షలు, శిరివెళ్ల రెడ్డిపేట ప్రాథమిక పాఠశాలకు రూ.3.05 లక్షలు, గుంప్రమాన్‌దిన్నె ప్రాథమిక పాఠశాలకు రూ. 3.08 లక్షలు, కస్తూర్బా రూ.9.08 లక్షలు, జెడ్పీ యర్రగుంట్లకు రూ.4.56 లక్షలు, మహదేవపురం ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రూ. 62 వేలు విడుదలయ్యాయని వివరించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

చాగలమర్రి: ఇంటర్ పరిక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని సిట్టింగ్ స్క్వాడ్ అధికారి మురళీ మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ఎస్వీ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలోని 4 జూనియర్, బర్స్ ఒకేషనల్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం బోటనీ-2, గణితం-2, గణితం-2ఎ, వోకేషనల్ పరీక్షలకు సంబంధించి 333 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా వారిలో జూనియర్ కళాశాలలకు సంబంధించి 50 మంది, వోకేషనల్ కోర్సుకు సంబంధించి 1 విద్యార్థి గైర్హజరయ్యారని వివరించారు.

బహిరంగ వేలాలు వాయిదా

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ గేట్లు, పార్కింగ్ తదితర అంశాలపై బహిరంగ వేలాలను వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి గురువారం తెలిపారు. సరైన పాటదారులు లేనందున వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. తదుపరి వేలానికి సంబంధించి వివరాలు వెల్లడిస్తామన్నారు.

వైద్య శిబిరాలకు మందుల పంపిణీ

నంద్యాల టౌన్: శివరాత్రి సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ప్రముఖ శైవ క్షేత్రాల్లో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలకు రూ.3 లక్షలు విలువ చేసే మందులు పంపిణీ చేసినట్లు రెడ్ క్రాస్ జిల్లా కమిటీ వైస్ చైర్మన్ మారుతి కుమార్ తెలిపారు.







ప్రారంభానికి సిద్ధంగా డోర్నిపాడు - అర్జునాపురం రహదారి, బుర్రారెడ్డిపల్లెలో ముస్తాబైన ఆర్‌బీకే, డోర్నిపాడులో నిర్మించిన సీసీ రోడ్డు

- రూ.2.40 కోట్లతో పనులు
- నేడు ప్రారంభించనున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే గంగుల

ప్రారంభానికి సిద్ధం

డోర్నిపాడు: మండలంలోని పలు గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. రూ.96 లక్షలతో డోర్నిపాడు నుంచి అర్జునాపురం రోడ్డు, రూ.21.80లక్షలతో బుర్రారెడ్డిపల్లెలో ఆర్‌బీకే, భాగ్యనగరంలో రూ.10లక్షలతో డ్రైనేజీ, రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారు. అలాగే అమ్మిరెడ్డినగరంలో రూ.10లక్షలు, అర్జునాపురంలో రూ.5లక్షలు, డోర్నిపాడులో రూ.39లక్షలు, చాకరాజువేముల గ్రామంలో 33లక్షలు, గుండుపాపలలో రూ.15లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు.